క్లుప్తంగా

శాకంబరిగా భ్రమరాంబ దర్శనం



సత్తెనపల్లి: లోక కల్యాణార్థం ఆషాఢ మాసంను పురస్కరించుకొని మండలంలోని పెద్ద మక్కెన గ్రామంలో ఉన్న గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయంలో అమ్మవారిని శనివారం శాకంబరీదేవిగా అలంకరించారు. వివిధ రకాల కూరగాయలు, నిమ్మకాయలు, వేపాకుతో ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. వారికి ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పారుపల్లిలో వైద్య శిబిరం



క్రోసూరు: పారుపల్లి గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యగా పీహెచ్‌సీ వైద్యుల ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ ఎం.సిరి చందన, మలేరియా సబ్ యూనిట్ అధికారి బేగ్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 50 మందిని పరీక్షించి అవసరమైన వారికి చికిత్సలు, మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులు బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించారు. మురుగు కాలువల్లో ఎబేట్ ద్రావణం చల్లించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్ లేని వాహనాలపై చర్యలు



అచ్చంపేట: ప్రతి వాహనానికి తప్పనిసరిగా నంబర్ ప్లేట్ ఉండాలని, రాజకీయ నాయకులు, సినిమా హీరోలతో కప్పి పుచ్చాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అచ్చంపేట సీఐ కె.వెంకటప్రసాద్ హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో ఎక్కడైనా అరాచకాలు జరుగుతుంటే తన దృష్టికి తేవాలన్నారు. మత్తు పదార్థాల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. మండలంలోని ప్రతి పాఠశాలను త్వరలో సందర్శించి, ఈవ్‌టీజింగ్‌పై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. అభూత కల్పనలు, కట్టుకథలతో వార్తలను ప్రచురించవద్దని, వాస్తవాలను తెలుసుకుని, నిర్ధారించుకున్న తరువాతనే టీవీలలో, పత్రికలలో వార్తలుండాలని సూచించారు.


నోట్ పుస్తకాలు పంపిణీ



సత్తెనపల్లి: విద్యార్థులందరూ బాగా చదువుకొని ఉజ్వల భవిష్యత్తు పొందాలని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలు, బ్యాగులను శనివారం ఆయన పంపిణీ చేశారు. కళాశాలలో ఆగిపోయిన అభివృద్ధి పనులు ఖచ్చితంగా పూర్తి చేస్తామన్నారు. విద్యా, వైద్య, అభివృద్ధి, సంక్షేమం పరంగా ప్రభుత్వం ప్రజలు ఆశించిన విధంగా ఉంటుందని, దానికి నిదర్శనం ప్రభుత్వ కళాశాలలో పుస్తకాల పంపిణీ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ యు.కోటేశ్వరమ్మ, అధ్యాపకులు, విద్యార్థులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సెప్టెంబరు 14న జాతీయ లోక్ అదాలత్

సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు



రేపల్లెరూరల్: మెగా లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కరించి, కక్షిదారులకు న్యాయం చేకూరేలా న్యాయవాదులు చర్యలు తీసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి టి.వెంకటేశ్వర్లు అన్నారు. సెప్టెంబర్ 14న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కారమయ్యేలా పని చేయాలని బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులకు శనివారం స్థానిక కోర్టు హాలులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కరించేలా అధికారులు పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.రూపశ్రీ, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

మాస్త్రీన్‌పేట..ఇచ్చట మౌలిక వసతులుండవు!



డ్రెయినేజీకి కూడా నోచుకోని మాస్త్రీన్‌పేట



మాస్త్రీన్ పేటలో అధ్వానంగా ఉన్న మట్టి రోడ్డు

సత్తెనపల్లి: పట్టణంలోని మాస్త్రీన్‌పేట సమస్యలకు నిలయంగా మారింది. 2019కి ముందు టీడీపీ ప్రభుత్వ హయాంలో వావిలాల ఘాట్‌ను పార్కుగా అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టారు. ఆ ప్రాంతంలో 15 ఏళ్లుగా పూరిగుడిశెలు వేసుకొని నివసిస్తున్న నిరుపేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలను అక్కడి నుంచి ఖాళీ చేయించారు. వారందరికీ అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని, త్వరలోనే పక్కా గృహాలు మంజూరు చేస్తామని అప్పట్లో హామీ ఇచ్చారు. వారిని తాత్కాలికంగా మాస్త్రీన్‌పేట సమీపంలోని నందిగామ రోడ్డు దగ్గర్లో ఉన్న ఎస్‌బీజీ కళాశాల సమీపానికి తరలించారు. అప్పటి నుంచి ఆ పేద వర్గాలకు పక్కా గృహాలు కానీ, మౌలిక వసతులు, రహదారులు, డ్రెయినేజీ వ్యవస్థ, కనీసం సామాజిక మరుగుదొడ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఆ ప్రాంతంలో కళాశాల రోడ్డుకి ఇరువైపులా మల, మూత్ర విసర్జన చేస్తున్నారు. దాని వల్ల ఆ మార్గంలో రాకపోకలు సాగించే ప్రజలు, విద్యార్థులు, రైల్వే ప్రయాణికులు దుర్గంధం భరించలేకపోతున్నారు. ఈ సమస్యను అనేక సార్లు ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టికి తీసుకు వచ్చినప్పటికీ ఎలాంటి పరిష్కారం చూపలేదని స్థానికులు చెబుతున్నారు. కనీసం ప్రజా మరుగు దొడ్లు అయినా నిర్మిస్తే బహిరంగ మల, మూత్ర విసర్జన లేకుండా స్వచ్ఛ సత్తెనపల్లికి దోహదపడేది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు స్పందించి మాస్త్రీన్‌పేట సమీపంలో నివసిస్తున్న నాటి వావిలాల ఘాట్ పేద ప్రజలకు కనీసం మౌలిక వసతులు కల్పించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

తల్లిపాలతోనే బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి



వారోత్సవాల్లో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల



ర్యాలీలో పాల్గొన్న సూపర్‌వైజర్ జయలక్ష్మి, సిబ్బంది



ర్యాలీలో పాల్గొన్న ఆరోగ్య సిబ్బంది



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

సత్తెనపల్లి: తల్లి పాలు బిడ్డకు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్ వైజర్ ప్రమీల అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని 25వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రు పాలను గంటలోపు పట్టించటం వల్ల పిల్లలకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఏఎన్‌ఎం దీవెన కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు భానుమతి, నజ్మా, అంగన్‌వాడీ ఆయా కాసు బాయ్, ఆశ వర్కర్ శివ పార్వతీ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

మాదలలో తల్లిపాల వారోత్సవాలు

మాదల(ముప్పాళ్ల): మాదల గ్రామంలో తల్లి పాల వారోత్సవాలు శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.జయలక్ష్మి పాల్గొన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రు పాలు పట్టించాలని, ఆరు నెలలు తల్లి పాలు ఇవ్వాలని అవగాహన కల్పించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. దమ్మాలపాడు గ్రామంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఒ.అనంతలక్ష్మి పాల్గొని, తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ పీటర్ డేమియన్, ఏఎన్‌ఎం మస్తాన్‌బీ, సీహెచ్‌ఓ రహిమున్నీసా, కమల, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాల ర్యాలీ

రాజుపాలెం: మండలంలోని నెమలిపురి, కొండమోడు, గణపవరం, రాజుపాలెం, మొక్కపాడులోని ఆరోగ్య ఉప కేంద్రాలు, అంగన్‌వాడీల్లో తల్లిపాల వారోత్సవాలను శనివారం నిర్వహించారు. పుర వీధులలో ర్యాలీ నిర్వహించారు. కమ్యూనిటీ హెల్త్ అధికారులు లక్ష్మీదుర్గా, మాధవి, అలేఖ్య, సీహెచ్‌వో ప్రియదర్శిని, ఏఎన్‌ఎంలు శారద, విమల, మేరీ, నాగలక్ష్మి, సరళ, లక్ష్మీతిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు రోగనిరోధక శక్తి

బెల్లంకొండ: తల్లి పాల ద్వారా బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని చంద్రాజుపాలెం పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మణి కుమారి తెలిపారు. శనివారం కండిపాడు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాలలో తల్లి పాల పాముఖ్యత, పౌష్టికాహారంపై అవగహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం అరుణకుమారి, అంగన్‌వాడీ కార్యకర్త నాగమల్లీశ్వరి, ఆయాలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు

పెదకూరపాడు: మండలంలోని బుచ్చియ్యపాలెం, అమరావతి మండలంలో లింగాపురం గ్రామంలో తల్లి పాల వారోత్సవాలు సందర్భంగా అవగాహన కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ అధికారులు తల్లిపాల ప్రాముఖ్యతను తల్లులకు వివరించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ హిమబిందు, షేక్ మున్ని మాట్లాడుతూ బిడ్డకు ముర్రు పాలు ఎంతో ఆరోగ్యకరమన్నారు. ఈ కార్యక్రమంలో రేవతి, కిరణ్మయ్, శివరాణి, శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

రూ.2.81లక్షలకు ఆలయ భూముల కౌలు వేలం

బెల్లంకొండ: దేవాదాయ శాఖ భూములకు శనివారం కౌలు వేలం పాటలను నిర్వహించినట్లు మండల దేవాదాయ శాఖ అధికారి అవుదూరి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. వీరభద్ర స్వామి ఆలయానికి చెందిన 30.98 ఎకరాలకు రూ.2.45లక్షలు, నాగేశ్వర స్వామి ఆలయానికి చెందిన 9.20 ఎకరాలకు రూ.36,300 వేలంపాట పాడినట్లు తెలిపారు. రెండు ఆలయాలకు మెత్తం రూ.2.81 లక్షలు ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ వేలంలో సత్తెనపల్లి దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ లీలావతి, దేవాదాయ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

నకరికల్లు: మండలంలోని నకరికల్లు పంచాయతీ పరిధిలోని బెల్లంకొండ బ్రాంచి కెనాల్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ కె.నాగేందర్ రావు శనివారం తెలిపారు. నకరికల్లుకు సమీపంలో శివాపురం తండా వెళ్లే రోడ్డులోని బెల్లకొండ బ్రాంచి కెనాల్ నీటి ప్రవాహంలో వ్యక్తి మృతదేహం కొట్టుకొచ్చినట్లు వీఆర్వో సానా గౌరీ సమాచారం మేరకు ఘట నాస్థలానికి చేరుకొని వెలికితీసినట్లు చెప్పారు. మృతుడికి 50 నుంచి 55 ఏళ్ల వయస్సు ఉంటుందని, శరీరంపై నలుపు రంగు మొలతాడు తప్ప దుస్తులు ఏమీ లేవన్నారు. నీటిలో ఉండడం వల్ల చర్మంతో పాటు నుదుటిపై వెంట్రుకలు, చర్మం ఊడిపోయి ఉందని, కుడి కంటిపై నుదురు వద్ద, కంటికింద గాయాలు ఉన్నట్లుగా గుర్తించామన్నారు. ఎవరైన ఆనవాళ్లు బట్టి గుర్తిస్తే స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి

నూజెండ్ల: మండలంలోని పమిడిపాడులో విద్యుదాఘాతానికి గురై ఓ వృద్ధ మహిళ మృతి చెందింది. గ్రామానికి చెందిన గంగవరపు పెదపేరమ్మ (65) పొలానికి వెళ్లింది. ఈక్రమంలో తెగిపడి ఉన్న విద్యుత్ తీగను తాకడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఆమెను రక్షించబోయి ఎండ్లూరి వీరయ్యకు విద్యుదాఘాతమై గాయాలయ్యాయి.

మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై కేసు

- చిలకలూరిపేట రూరల్ సీఐ బి.సుబ్బానాయుడు
- యడ్లపాడు పోలీస్‌స్టేషన్ సందర్శన
- రికార్డులు పరిశీలన.. సిబ్బందికి పలు సూచనలు



యడ్లపాడు: మైనర్లకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు అవుతాయని చిలకలూరిపేట రూరల్ సీఐ బి.సుబ్బానాయుడు హెచ్చరించారు. యడ్లపాడు మండల పోలీస్‌స్టేషన్‌ను ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా యడ్లపాడు స్టేషన్ ఇన్‌చార్జి ఎస్‌ఐ వి.బాలకృష్ణ ద్వారా పెండింగ్ కేసుల వివరాలను తెలుసుకున్నారు. సిబ్బంది సమన్వయంతో పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. రికార్డులను పరిశీలించి పలు సలహాలు, సూచనలు చేశారు.

అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ వివిధ సమస్యలతో స్టేషన్‌కు వచ్చే వారితోనూ మర్యాదగా నడుచుకోవాలన్నారు. అలాగే గ్రామాల్లోని ప్రజలు స్నేహపూర్వకంగా పోలీసులు ఉండాలన్నారు. మైనర్లకు వాహనాలిస్తే వారి పేరెంట్స్‌ను స్టేషన్‌కు పిలించి వారిపై కేసులు పెట్టాల్సి వస్తుందన్నారు. అలా రెండుసార్లు కేసులు నమోదైతే వారి వాహన లైసెన్సులు రద్దు చేయాల్సి ఉంటుందన్నారు. గ్రామాల్లో ఏదైనా సమస్య వచ్చినపుడు ఇరువర్గాలకు చెందిన పెద్దలు ముందుగా మాట్లాడుకుని సామరస్యంగా పరిష్కరించుకునే ప్రయత్నం చేయాలన్నారు. అలాకాకుండా లేనిపోని భేషజాలకు పోయి ఘర్షణలు పడితే ఆర్థిక, ఆరోగ్యపరంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. అలాగే కుటుంబాలు చిన్నాభిన్నం కావడం చేస్తున్న పనులు, సమయం వృథా అవుతుందన్నారు. తద్వారా మానసిక ఒత్తిడిలకు గురికావాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని గ్రహించాలన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు చేస్తున్నట్లు స్థానికులు గుర్తిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

రేషన్ బియ్యం స్వాధీనం



వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలం భూమాయపాలెం వద్ద ఆటోలో రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తుండగా ఐనవోలు పోలీసులు పట్టుకొని స్వాధీనం చేసుకున్నారు. ఏపీ 39 యూపీ 9792 నంబరు గల ఆటోలో రేషన్ బియ్యం తరలిస్తుండగా పోలీసులు పట్టుకోవడం జరిగింది. ఆటో డ్రైవర్ పరారిలో ఉన్నట్లు తెలిపారు. రేషన్ బియ్యం ఎవరి వద్ద నుంచి ఎక్కడి తరలిస్తున్నారు అనే సమాచారం తెలియాల్సి ఉందని, కనీసం ప్రభుత్వ గోతాలు కూడా మార్చకుండా రేషన్ బియ్యం మాఫియా జరుగుతుందని, లబ్ధిదారులకు బియ్యం ఇవ్వకుండా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకోవాలి



వేడుకల్లో మాట్లాడుతున్న మాజీ మేయర్ కన్నా నాగరాజు



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

సత్తెనపల్లి: విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకొని, జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు పేర్కొన్నారు. పట్టణంలోని కాకతీయ కల్యాణ మండపంలో కృష్ణవేణి జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. జీవితంలో లక్ష్యం చేరుకోవడానికి అహర్నిశలు కష్టపడాలన్నారు. విశిష్ట అతిథి కృష్ణవేణి, ఎస్వీఆర్ విద్యా సంస్థల మాచర్ల డైరెక్టర్ యనమదల వెంకట్రామయ్య మాట్లాడుతూ ఇష్టపడి చదువుకుంటే అద్భుత ఫలితాలు సాధించవచ్చునన్నారు. కళాశాల డైరెక్టర్ వీరవల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కష్టపడి చదివితే జీవితమంతా సుఖంగా ఉండొచ్చన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. సీనియర్ ఇంటర్ విద్యార్థులు జూనియర్లకు ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కావూరి రాజేంద్రప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

సివిల్ జడ్జి పి.ప్రియదర్శిని



మాట్లాడుతున్న న్యాయమూర్తి ప్రియదర్శిని

సత్తెనపల్లి: మాదక ద్రవ్యాల వినియోగం, విక్రయం, రవాణా, తయారీ చట్ట వ్యతిరేఖమని మొదటి అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పి.ప్రియదర్శిని పేర్కొన్నారు. మండల న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీ బాబా గురుదేవ్ డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాల వ్యతిరేఖం(యాంటి డ్రగ్స్) పై శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. న్యాయమూర్తి మాట్లాడుతూ ఎన్‌డీపీఎస్ చట్టం గురించి విద్యార్థులు తెలుసుకోవాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో డ్రగ్స్ ఉపయోగించకూడదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అవగాహన కల్పించారు. పట్టణ సీఐ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ డ్రగ్స్ సరఫరా, విక్రయ సమాచారం తెలిస్తే ముందుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి టౌన్ ఎస్‌ఐ ఎం. సంధ్యారాణి, ప్యానల్ న్యాయవాదులు దివ్వెల శ్రీనివాసరావు, బీఎల్ కోటేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపల్ దార్ల మాధవి, పారా లీగల్ వలంటీర్లు గోపాల్, కోట బాబూ రావు పాల్గొన్నారు.

సంగం డెయిరీ ఖాతాదారులకు బోనస్ అందజేత



శ్రీనివాసరెడ్డికి బోనస్ నగదు అందిస్తున్న డైరెక్టర్ ధర్మారావు

దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరు గ్రామంలో సంగం డెయిరీ ఖాతాదారులు 75 మందికి శనివారం బోనస్‌లు పంపిణీ చేశారు. రెంటపాళ్ల సంగం డెయిరీ డైరెక్టర్ ధర్మారావు పాల్గొని, ఖాతాదారులకు లీటర్‌కు రూ.4ల చొప్పున బోనస్ నగదు రూ.2,34,000 పాల కేంద్రం ప్రెసిడెంట్ పొనెం శ్రీనివాసరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది రూ.58 లక్షల టర్నోవర్ జరిగినట్లు వివరించారు. అందుకు ప్రోత్సాహంగా బోనస్ అందజేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో రెంటపాళ్ల మేనేజరు గోపీ, డెయిరీ సిబ్బంది పాల్గొన్నారు.

దాహార్తి తీరే దారి చూపండి



అంచులవారిపాలెంలో మూసివేసిన వాటర్ ప్లాంట్

రాజుపాలెం: మండలంలోని అంచులవారిపాలెం పంచాయతీలో బాల వికాస్ సహకారం, పంచాయతీ నిధులతో వాటర్ ప్లాంట్‌ను 2021లో ఏర్పాటు చేశారు. నీలం వెంకయ్య వాటర్ ప్లాంట్‌గా అప్పటి నుంచి ప్రజల దాహార్తిని తీరుస్తోంది. నెలక్రితం కొద్ది పాటి మరమ్మతులు రావడంతో ప్లాంట్‌ను మూసివేశారు. దీంతో ప్రజలు మంచి నీటి కోసం నానా అవస్థలు పడుతున్నారు. ప్రతి రోజు ఈ వాటర్ ప్లాంట్ నుంచి సుమారు 100 క్యాన్‌ల నీటిని తీసుకెళ్తుంటారు. అంచులవారిపాలెంలో ఈ ఒక్క వాటర్ ప్లాంట్ మాత్రమే ఉంది. ఇప్పుడు ఇది కూడా మూసివేయడంతో కిలోమీటర్ దూరంలో ఉన్న అనుపాలెం వెళ్లి మంచి నీటిని గ్రామస్తులు తెచ్చుకుంటున్నారు. ఇప్పటికైన గ్రామ సచివాలయ కార్యదర్శి ముక్తారు స్పందించి, వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు నిర్వహించి, వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

పోరాటానికి ఫలితం దక్కింది



పాలాభిషేకం చేస్తున్న నేతలు

పెదకూరపాడు: సుప్రింకోర్టు తీర్పుతో 30 సంవత్సరాల పోరాటానికి ఫలితం దక్కిందని తెలుగుదేశం ఎస్సీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి పాటిబండ్ల బాలయ్య అన్నారు. పెదకూరపాడులో ఎస్సీ వర్గీకరణ పై కోర్టు తీర్పు నేపథ్యంలో అంబేడ్కర్, కృష్ణ మాదిగ, ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బాలయ్య మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడే చంద్రబాబు వర్గీకరణకు మద్దతు ఇచ్చారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో అపార్టీ నాయకులు ఆర్తిమళ్ల రమేష్, వేమవరపు రాజారాం, జంగాల ప్రసాద్, పాటిబండ్ల శివయ్య, తాళ్ళూరు రమేష్, సారే కుక్క నాగేశ్వరరావు చంటి పాల్గొన్నారు.

విద్యార్థిని వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరించాలి

- గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌పై చర్య తీసుకోవాలి
- బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాబూరావు



అనారోగ్యం పాలైన విద్యార్థినిని వైద్యశాలకు తీసుకెళుతున్న తల్లిదండ్రులు

రొంపిచర్ల: తీవ్ర అనారోగ్యం పాలైన పదోతరగతి విద్యార్థిని వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరించాలని, అందుకు కారణమైన సంతగుడిపాడు కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌పై చర్య తీసుకోవాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు బూదాల బాబూరావు డిమాండ్ చేశారు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న అన్నవరప్పాడు గ్రామానికి చెందిన సరిమల్ల సన్నిధి అనే విద్యార్థినీ పదవ తరగతి పరీక్షలకు ముందు జ్వరం వచ్చిందని, ఈ విషయం ప్రిన్సిపాల్‌కు తెలియచేసినా వైద్యం చేయించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. కనీసం ఆ కుటుంబానికి సమాచారం ఇవ్వలేదన్నారు. ఆ అమ్మాయి ఇంటికి పంపించకుండా పరీక్షలు అయిపోయేంత వరకు నిర్లక్ష్యం వహించడంతో ఆ అమ్మాయికి జ్వరంతోపాటు కామెర్లు అయ్యాయని, అవి బాగా ముదిరి శరీరంలోని అవయవాలు చెడిపోయి నేడు చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోందన్నారు. కూలీ చేసుకుని బతికే కుటుంబమని, ఇప్పటికే లక్షల దాకా ఖర్చు పెట్టినా ఎలాంటి ఫలితం లేకుండా పోయిందన్నారు. వైద్యులు ఆ అమ్మాయిని హైదరాబాదులో అపోలో హాస్పిటల్‌కి తీసుకెళ్లాలని, అక్కడ సుమారు రూ.15 లక్షలు ఖర్చవుతుందని చెప్పారని, ప్రభుత్వం ఆదుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

డివైడర్‌ను ఢీకొని వ్యక్తికి గాయాలు



రొంపిచర్ల: స్థానిక శ్రీ కాసు బ్రహ్మానంద రెడ్డి ఎక్స్‌ప్రెస్‌వేపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన సోలిశెట్టి నాగవర్ధన్‌కు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగవర్ధన్ హైదరాబాద్ నుంచి ద్విచక్రవాహనంపై ఒంగోలు సమీపంలో ఉన్న కామేపల్లి పోలేరమ్మ అమ్మవారి గుడికి బయలుదేరాడు. రొంపిచర్ల సమీపంలోకి రాగానే చెక్ పోస్ట్ సమీపంలో డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నాగవర్ధన్‌కు గాయాలయ్యాయి. తలకు హెల్మెట్ ధరించటం వల్ల పెద్ద ప్రమాదం తప్పింది. ఎన్‌ఏఎం ఎక్స్‌ప్రెస్ వే అంబులెన్స్‌లో గాయాలైన నాగవర్ధన్‌ను నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు.